

రెచ్చగొట్టారు..రెచ్చిపోయారు

ఎన్నికల సందర్భంగా నరసరావుపేట నుంచి వచ్చిన టీడీపీ రౌడీ మూకలు దర్శిలో స్థానిక కార్యకర్తలను రెచ్చగొట్టి అరాచకం సృష్టించి వెళ్లిపోయారు. -10లో..



జూనియర్ కాలేజీలుగా జెడ్పీ పాఠశాలలు

జిల్లాలో 11 జెడ్పీ పాఠశాలలను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. -10లో..

గరిష్టం/కనిష్టం
32/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు

ఒంగోలు: జిల్లాలో పాల్ ల్యాబ్ సౌకర్యం ఉన్న 33 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఒక గణితం, ఒక ఆంగ్ల సబ్జక్టు టీచర్లకు శనివారం ఒకరోజు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిక్షణ స్థానిక బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లాతోపాటు బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని 74 పాఠశాలల నుంచి 222 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. శిక్షణ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని, శిక్షణకు కేటాయించిన ప్రతి ఒక్క ప్రధానోపాధ్యాయుడు, టీచర్లు తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరికీ మినహాయింపు లేదన్నారు. సంబంధిత డివిజన్ విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శిక్షణకు కేటాయించిన వారిని రిలీవ్ చేయాలన్నారు.

ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ఒంగోలు: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ అండ్ ట్యాలీ కోర్సుల్లో శిక్షణ, ఉద్యోగం కల్పిస్తారని ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్ పాస్/ ఫెయిల్, డిప్లొమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్ / ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని, 35 రోజులపాటు జరిగే ఈ శిక్షణ కాలంలో భోజనం, ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. 35 రోజుల కోర్సులో ట్యాలీ జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఉచితంగా ఇస్తారన్నారు. శిక్షణ తదనంతరం వంద శాతం వివిధ సంస్థల్లో కనీస నెల జీతం రూ.15 వేలు పైన కల్పిస్తారన్నారు. పూర్తి వివరాలకు హరిప్రసాద్ 9000487423 ను సంప్రదించాలన్నారు.

కలెక్టర్‌కు స్వీప్ అధికారుల అభినందనలు

ఒంగోలు అర్బన్: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను స్వీప్ నోడల్ అధికారులు బీ రవి, పీఎస్ జ్యోతి శుక్రవారం ప్రకాశం భవనంలో కలిసి అభినందనలు తెలిపారు. సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 87.06 శాతం ఓటింగ్‌తో మొదటి స్థానం నిలవడంతో పాటు దర్శి అసెంబ్లీ స్థానం 90.91 శాతంతో మొదటి స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. మొత్తం మీద రాష్ట్రంలో మన జిల్లా 87.9 శాతంతో మొదటి స్థానంలో నిలిచేందుకు కలెక్టర్ సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని స్వీప్ అధికారులు తెలిపారు. దీనిలో సూపరింటెండెంట్ నాగజ్యోతి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మారుతి ఇతర స్వీప్ బృందం సభ్యులు పాల్గొని కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

కర్షకానందం

ఖరీఫ్‌కు వరుణ సందేశం



"విస్తారంగా వర్షాలు కురుస్తాయి.. నైరుతి రుతు పవనాలు ముందుగానే వస్తున్నాయి.." అంటూ వాతావరణ శాఖ అధికారులు చేసిన ప్రకటన అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. వచ్చే నెల మొదటి వారంలో అవి రాష్ట్రాన్ని తాకి విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనాలు వేస్తుండడంతో ఖరీఫ్‌కు ఢోకా ఉండదంటూ రైతులు సంబరపడుతున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంది. జిల్లాలో సుమారు 3,70,307 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

- ముందుగానే నైరుతీ రుతు పవనాలు
- విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం
- ఆనందంలో అన్నదాతలు
- ఇప్పటికే ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- రైతులకు అందుబాటులో యంత్రాలు, విత్తనాలు
- భూసార పరీక్షలకు సిద్ధమవుతున్న అధికారులు
- జిల్లాలో 3,70,307 ఎకరాల్లో సాగు

ఒంగోలు సెంట్రల్: ఎల్‌నినో ప్రభావం తగ్గి..లానినో పరిస్థితులు ఏర్పడడంతో ఎండల తీవ్రత తగ్గిపోయింది. దీనికి తోడు అరేబియా సముద్రంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో నాలుగు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. మే నెలలో సాధారణ వర్షపాతం 53.3 మి.మీ. అయితే ఇప్పటికే 40.2 మి.మీ నమోదైంది. గురువారం జిల్లా వ్యాప్తంగా 9.3 మి.మీ వర్షం కురిసింది. మరో నాలుగు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా 2023 జూన్ నుంచి 2024 మే 16 వరకు సాధారణ వర్షపాతం 821.8 కాగా సరాసరి 553.9గా నమోదైంది.

ఖరీఫ్‌లో 3,70,307 ఎకరాల్లో సాగు

సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,99,757 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. అయితే ఈ దఫా 3,70,307 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి అన్నదాతలకు అవసరమైన యంత్రాలు, విత్తనాలు అందుబాటులో ఉంచారు. జిల్లాలో 616 రైతు భరోసా కేంద్రాల్లో యంత్రాలు, యంత్ర పరికరాలు అందుబాటులో ఉండడంతో రైతులు ఖరీఫ్ సీజన్‌కు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ఒక వైపు భూసార పరీక్షలు చేస్తూనే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచారు. మట్టి నమూనా సేకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు.

విత్తనం మంచిదైతే పంట బాగు

రైతులకు మేలైన విత్తనాలు అందించాలన్న లక్ష్యంతో వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఎరువు నాణ్యతతో ఉంటే పంటలు ఏపుగా కూడా పెరిగి పచ్చదనంతో కళకళలాడతాయి. పంటలపై పిచికారి చేసే పురుగుమందు కూడా నాణ్యతతో ఉంటే చీడ పీడలు సకాలంలో అదుపు చేసుకోవచ్చు. ఇందులో ఏదీ నాణ్యతతో లేకపోయినా దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. నకిలీలు, కల్తీలకు తావు లేకుండా ప్రభుత్వం నియోజకవర్గం వారీగా వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాలను ముందు జాగ్రత్తగా ల్యాబ్‌ల్లో చెక్ చేసుకునే వీలుంది. ఈ పరీక్షలు ఉచితంగానే చేస్తారు.

జిల్లాలో ప్రధాన పంటల సాగు ఇలా..

వరి	8,116
కంది	55,783
మినుములు	1135
ఆముదాలు	1295
చిరుధాన్యాలు	9006
పత్తి	18,302
మిరప	31,814
కూరగాయలు	18,256
సజ్జ	4742
జొన్న	3712

సబ్సిడీపై విత్తనాలు:

రైతన్నలకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తోంది. వరిలో బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఆర్ 1638, ఎంటీయూ 1271, బీపీటీ 2270, ఎంపీయూ 1121 రకం విత్తనాలు నాలుగు వేల టన్నుల వరకు సిద్ధంగా ఉన్నాయి. జూన్ 10వ వరకు ఈ విత్తనాలు పంపిణీ చేయనున్నారు.

కంది 1500 క్వింటాళ్లు అందుబాటులో ఉండగా అందులో ఎల్ఆర్‌జీ రకం 750 క్వింటాళ్లు, బీఎస్ఎంఆర్ 736 రకం 750 క్వింటాళ్లు, జూన్ 15 వరకు 30 శాతం సబ్సిడీపై అందించనున్నారు. మినుములు 30 శాతం సబ్సిడీపై 500 క్వింటాళ్లు, పచ్చ పెసలు 120 క్వింటాళ్లు, పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర 50 శాతం సబ్సిడీపై 2773 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నాం



ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వర్షాలు ఆశాజనకంగా పడుతుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించే ఏర్పాటు చేస్తున్నాం. సాగు విస్తీర్ణాన్ని బట్టి ఇప్పటికే మండలాల వారీగా విత్తనాలు కేటాయించాం.

– ఎస్.శ్రీనివాసరావు, జేడీఏ, వ్యవసాయశాఖ, ఒంగోలు

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నాం



రాజు మంచివాడైతే రైతులకు అన్నీ మేలు జరుగుతాయన్నట్లు ప్రస్తుతం వర్షాలు కూడా కురుస్తున్నాయి. పొలాలు పదునెక్కాయి. అందుకని ఖరీఫ్‌లో సాగు కోసం భూమిని సిద్ధం చేసుకుంటున్నారు. మినుము, పెసలు, నువ్వులు సాగు చేస్తున్నాను. గత ఐదేళ్లుగా వ్యవసాయశాఖ రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంది.

– వి.మాలకొండా రెడ్డి, ముండ్లమూరు మండలం

మల్లవరం వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయం

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి 8 గంటల నుంచి అకురారోహణ కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. 19 ఉదయం స్వామివారికి అగ్ని ప్రతిష్టాపనలో నిత్యహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించి ధ్వజారోహణ సమయంలో సంతానంలేని దంపతులకు గరుడ ప్రసాదం అందిస్తారు. రాత్రికి శేష వాహన సేవ, 20వ తేదీ సాయంత్రం హంసవాహన సేవ, 21వ తేదీ సింహ వాహన సేవ, 22వ తేదీ హనుమద్వాహన సేవ, 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు మోహినీ ఉత్సవం, రాత్రికి గరుడ సేవ 24వ తేదీ రాత్రికి గజోత్సవం, 25వ తేదీ శనివారం రోజున ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, కల్యాణం అనంతరం భక్తులకు అన్న సంతర్పణ, రాత్రికి రథోత్సవం, 26వ తేదీన అశ్వవాహనం, 27వ తేదీ ధ్వజావరోహణ పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని, 28వ తేదీ ఉదయం 8 గంటలకు చక్రతీర్థం, రాత్రి 8 గంటలకు ఏకాంత సేవ కాగడా సేవ నిర్వహిస్తున్నట్లు పలువురు ఉభయ దాతలు బ్రహ్మోత్సవాలకు సహకరిస్తున్నారని ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, నారాయణం రాజశేఖరాచార్యులు ఆధ్వర్యంలో ప్రముఖ యాజ్ఞికులు ఆగమ ప్రవర దివి వెంకట శేషాచార్యులు స్వామివారి కల్యాణ కార్యక్రమం నిర్వహిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి తెలిపారు.

పటిష్టంగా బందోబస్తు

మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు నిర్వహించనున్నట్లు మద్దిపాడు ఎస్ఐ వీ మహేష్ తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్‌తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించినట్లు తెలిపారు. కల్యాణం సమయంలో రద్దీని తట్టుకోవడానికి అవసరమైన సిబ్బందిని కేటాయిస్తున్నామన్నారు.

పోల్డ్ ఈవీఎంలకు పటిష్ట భద్రత

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ఒంగోలు అర్బన్: రాష్ట్రంలో పోల్డ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లకు పటిష్టమైన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి శుక్రవారం ఆయనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రతా చర్యలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ పోల్డ్ ఈవీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవటంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. కలెక్టర్, ఎస్పీలు స్ట్రాంగ్ రూమ్‌లను ప్రతి రోజు సందర్శించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఒంగోలు, దర్శి, గిద్దలూరు, కనిగిరి, కొండపి అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌ఓలు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, నాగజ్యోతి, జాన్ ఇర్విన్, కుమార్, కలెక్టర్ పరిపాలన అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములు పరిశీలించిన కలెక్టర్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అనంతరం భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ శుక్రవారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు, 8 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్టమైన భద్రతా ఉండాలన్నారు. భద్రతా చర్యల్లో ఉన్న అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్ట్రాంగ్ రూములకు వేసిన సీళ్లను పరిశీలించారు.



రైజ్ ఇంజనీరింగ్ కాలేజిలో స్ట్రాంగ్ రూములు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షునిగా వెంకట్రావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కమిటీ


ఒంగోలు: ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షునిగా బి.వెంకట్రావు నియమితులయ్యారు. స్థానిక హెడ్మాస్టర్స్ సంఘ భవనంలో శుక్రవారం నూతన జిల్లా కమిటీ ఎంపిక జరిగింది. ఈ ఎంపిక జిల్లా అధ్యక్షుడు కేవీజీ కీర్తి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఎ.అమ్మయ్య, జిల్లా అధ్యక్షునిగా బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా బి.అశోక్‌కుమార్, సహాయ అధ్యక్షులుగా ఎన్.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా పీవీ ప్రభాకరరావు, కె.వెంకటేశ్వర్లు, యం.విశ్వభారతి, టి.పాండురంగస్వామి, అదనపు కార్యదర్శిగా ఎస్‌హెచ్ కబీర్, కార్యదర్శులుగా బి.నాగార్జున, విక్రమ్, జి.పాండు, ఎస్.శ్రీదేవి, కె.పెద్దన్న, యం.సురేష్ బాబు, ఎ.గురులింగం, టి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.వెంకట్రావు, బి.అశోక్ కుమార్, పీవీ సుబ్బారావు, వై.శ్రీనివాసులు, కేవీజీ కీర్తి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.ఆంజనేయులు, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా సీహెచ్‌వీ చలపతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యారంగాన్ని పరిరక్షించుకుని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఖరీఫ్, రబీ సీజన్‌లకు ప్రణాళిక సిద్ధం

- జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు
- 'తరుముకొస్తున్న కాలం..కదులుతుందా యంత్రాంగం' కథనానికి ఖండన

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌కు కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి పంపామని అందుకు అనుగుణంగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఒక పత్రికలో (సాక్షి కాదు) శుక్రవారం 'తరుముకొస్తున్న కాలం–కదులుతుందా యంత్రాంగం' పేరుతో ప్రచురితమైన కథనాన్ని ఆయన ఖండిస్తూ... శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు 667, పెసర 390, జనుములు 1716 క్వింటాళ్లు జిల్లాకు కేటాయించారని చెప్పారు. ఖరీఫ్‌లో సాగు చేయటానికి వరి 4000, పెసర 120, మనుము 500, కంది 1500 క్వింటాళ్లు కేటాయించారని, సదరు విత్తనాలు ఏపీ సీడ్స్ ద్వారా సాధారణ రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆయా మండలాలకు ఇప్పటికే కేటాయించామని రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని వారికి కావాల్సిన విత్తనాలు రాయితీపై పొందవచ్చన్నారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద (ఎన్ఎఫ్ఎస్ఎం) ద్వారా గత సంవత్సరం 31,600 మినీ కిట్స్ పూర్తి రాయితీపై రైతులకు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ సంవత్సరం 35,00 కంది కిట్స్ కేటాయింపునకు ప్రతిపాదనలు పంపారన్నారు. అవి కూడా అందుబాటులోకి వస్తాయని, రైతులు తమ వద్ద ఉన్న స్వంత విత్తనాలు కూడా సాగుకు సిద్ధం చేసుకుని ఉన్నారని వివరించారు.





నడివేసవిలో చల్లని కబురు

మండు వేసవిలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఒంగోలు నగరంలో శుక్రవారం దట్టమైన నల్లని మేఘాలు కమ్ముకున్నాయి.

– సాక్షి, ఒంగోలు

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని ప్రభుత్వ ఐటీఐ శిక్షణ కేంద్రంలో ఈ విద్యా సంవత్సరానికి మొదటి దశ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం .నరేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన ఆసక్తి గల విద్యార్థుల నుంచి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్, కోపా, డ్రాఫ్ట్‌మెన్ సివిల్‌లో ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు ఆన్‌లైన్‌లో httpr://www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అప్లోడ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 95533 06631 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

● యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దదోర్నాల: బాలికపై అత్యాచారయత్నానికి ఒడిగట్టిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని చిన్నదోర్నాలలో చోటుచేసుకుంది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన యలకపాటి ప్రవీణ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఎస్సై కథనం మేరకు మండల పరిధిలోని చిన్నదోర్నాలలో బహిర్భూమికి వెళ్లిన బాలికపై అదే గ్రామానికి చెందిన యలకపాటి ప్రవీణ్ అనే యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలికకు మార్కాపురం ఏరియా వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమరావు తెలిపారు.

రెచ్చగొట్టారు.. రెచ్చిపోయారు..!

● టీడీపీ దర్శి నాయకులను రెచ్చగొట్టిన ఆ పార్టీ నరసరావుపేట నేతలు
● రెచ్చిపోయి ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన స్థానిక నేతలపై కేసులు
● రెచ్చగొట్టి వెళ్లిపోయిన నరసరావుపేట రౌడీ నేతలను వదిలేసిన పోలీసులు
● ఖాకీల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు



సాయంత్రం 6 గంటల తర్వాత బూత్‌లోకి చొచ్చుకెళ్తున్న కడియాల వెంకటేశ్వరరావు (ఫైల్)



దేవవరంలో కర్రలతో దాడి చేస్తున్న టీడీపీ మూకలు (ఫైల్)

దర్శి: నరసరావుపేట నుంచి టీడీపీ రౌడీ నేతలు వచ్చారు. ఆ పార్టీ దర్శి నాయకులను రెచ్చగొట్టారు. వారితో కలిసి రెచ్చిపోయిన స్థానిక నేతలు ఎన్నికల పోలింగ్ సందర్భంగా దర్శి మండలంలో గొడవలకు కారణమయ్యారు. ఈ గొడవల్లో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ప్రధాన అనుచరులపై మాత్రం ఎటువంటి కేసులు పెట్టకుండా పోలీసులు వదిలేశారు. కేవలం స్థానిక నాయకులపై మాత్రమే కేసులు పెట్టి నరసరావుపేట నుంచి వచ్చిన టీడీపీ రౌడీలను వదిలేయడం పట్ల ఖాకీల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. దర్శిలో గొడవలు సృష్టించేందుకు నరసరావుపేట నుంచి టీడీపీ సామాజికవర్గానికి చెందిన అల్లరి మూకలను తీసుకొచ్చి ఒక్కరిపై కూడా కేసు నమోదు కాకుండా జాగ్రత్తపడి ఆ పార్టీ స్థానిక నాయకులను బలి చేయడంపై దర్శిలో జోరుగా చర్చ నడుస్తోంది.

కేసులు నమోదైన వారంతా స్థానికులే...

దర్శి మండలంలోని బొట్లపాలెం గ్రామంలో జరిగిన గొడవల్లో ఇరువర్గాలకు సంబంధించి ఒక్కో వర్గంలో 11 మంది చొప్పున కేసులు పెట్టారు. వారంతా స్థానికులే కావడం గమనార్హం. దేవవరంలో జరిగిన దాడి విషయానికి వస్తే శేషంవారిపాలేనికి చెందిన ఓట్ల చేర్పులు, మార్పుల్లో సుమారు 25 ఓట్ల వరకు దేవవరం బూత్‌లోకి వచ్చాయి. అయితే, వాళ్లు 50 మందికి పైగా బూత్‌లోకి ప్రవేశించి దొంగ ఓట్లు వేసేందుకు లలిత్‌సాగర్‌తో కలిసి వచ్చారు. దీంతో స్థానికులు ఓటు ఉన్న వాళ్లు మాత్రమే లోపలికి వెళ్లాలని, మిగతావాళ్లు బయట ఉండాలని అడ్డుకున్నారు. దీంతో లలిత్ సాగర్ తెలివిగా పక్కకు వెళ్లి తమ రౌడీలను ఉసిగొల్పారు. వారు లోపలకు వెళ్లాల్సిందేనని గొడవలకు దిగడంతో తోపులాట జరిగింది. వాళ్లు ముందస్తు ప్లాన్ ప్రకారం వెంట తెచ్చుకున్న కర్రలతో అడ్డువచ్చిన వారందరినీ చితకబాదారు. మహిళలు అని కూడా చూడకుండా వారిని కూడా కొట్టి బీభత్సం సృష్టించారు. ఆ తర్వాత లలిత్ సాగర్ వెంటనే వచ్చి మళ్లీ తన అనుచరులతో వారిని తీసుకుని బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. లలిత్ సాగర్ బూత్‌లోకి వెళ్లాలంటే మీరొక్కరే వెళ్లండి.. మీతో వచ్చిన వారందరూ ఇక్కడే ఉండాలని అడ్డుకున్నారు. 20 నిముషాలకుపైగా గ్రామంలో మహిళలు లలిత్‌సాగర్‌ను నిలదీశారు. మీ ఊరు నుంచి రౌడీలను తీసుకొచ్చి ఇక్కడ ఎందుకు గొడవలు పెడుతున్నారని మండిపడ్డారు. ఇవేం రాజకీయాలు.. మీ వాళ్లు వచ్చి మా గ్రామంలో కర్రలతో తల పగులగొట్టారు.. దీనికి మీరేం సమాధానం చెప్తారని పదే పదే నిలదీయడంతో మొహం చాటేసి పోలీసులను అడ్డుపెటుకుని జారుకున్నారు. ఆ గొడవ అయిపోయిన తర్వాత అక్కడికి వచ్చిన సీఐకి జరిగిన విషయాన్ని పూసగుచ్చినట్లు చెప్పారు. లలిత్ సాగర్ కొత్తవ్యక్తులను తీసుకొచ్చి దౌర్జన్యం చేసి దొంగ ఓట్లు వేయించాలని చూశారని, అడ్డుకున్నందుకు గొడవలు సృష్టించారని, రౌడీలు, స్థానికులు కలిసి తమను విచక్షణారహితంగా కొట్టారని అక్కడున్న వారు సీఐతో చెప్పి మొత్తుకున్నారు. కానీ, ఆ రౌడీలపై మాత్రం ఎటువంటి కేసులు నమోదు చేయలేదు. కేసులు పెట్టిన ఆరుగురిలో ఒక్కరికి మాత్రమే దేవవరంలో ఓటు ఉంది. మిగతా వారికి ఓటు కూడా లేదు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పోలింగ్ బూత్‌ల వద్ద కూడా అల్లర్లు...

దర్శి పట్టణంలో కొత్తరెడ్డిపాలెం, పొదిలి రోడ్డుకు చెందిన పోలింగ్ బూత్‌లను స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లు వైఎస్సార్ సీపీకి ఎక్కువ మెజార్టీ వచ్చేవి కాగా, సాయంత్రానికి టార్గెట్ చేసుకుని ఈవీఎంలు ఎత్తుకెళ్లాలనే ఉద్దేశంతో 6 గంటల తర్వాత వంద మందికిపైగా అనుచరులతో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానిక నాయకులు, ఓట్లేసే వారు వారిని అడ్డుకున్నారు. లోపలికి వెళ్లి చూడాలంటే అభ్యర్థికి మాత్రమే అనుమతి ఉందని, మిగిలిన వారు వెళ్లడానికి లేదని అడ్డుకున్నప్పటికీ.. వాళ్లని నెట్టుకుని బూత్‌లలోకి ప్రవేశించేందుకు లక్ష్మి ప్రయత్నించారు. లక్ష్మితో పాటు నిబంధనలకు విరుద్ధంగా కడియాల వెంకటేశ్వరరావు, గొట్టిపాటి భరత్, కడియాల లలిత్ సాగర్‌లు కూడా వారి అనుచరులు 100 మందితో బూత్‌లలోకి ప్రవేశించి ఈవీఎంలు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ, వీరిపై ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఓటర్లు, ఏజెంట్లు అడ్డుగా నిలబడి ఈవీఎంలు ఎత్తుకెళ్లకుండా తలుపులు వేసి ఈవీఎంలను కాపాడుకున్నారే తప్ప ఏ ఒక్క పోలీసు వారిని ఆపిన పాపాన పోలేదు. కడియాల వెంకటేశ్వరరావు అనుచరులు అక్కడి ఓటర్లను, బూత్ ఏజెంట్లను తోసివేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా పోలీసులు కేవలం ప్రేక్షకపాత్ర మాత్రమే వహించారు. దీంతో వారి మధ్య గొడవలు పెద్దవి కావడంతో ప్రత్యేక బలగాలు వచ్చి వారిని పంపించి వేశారు. బూత్‌లో తాము ఏమీ చేయలేకపోయామనే ఆక్రోశంతో కడియాల కుటుంబం అక్కడి కార్యకర్తలను రెచ్చగొట్టి తమ అనుచరులను తీసుకెళ్లిపోయారు. ఆ తర్వాత టీడీపీ కార్యకర్తలు పోలీసులపై రాళ్లు రువ్వి బూత్ పైకి రాళ్లు విసిరేసి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో ప్రత్యేక పోలీసు బలగాలు వచ్చి చెదరగొట్టాయి. ఇంత గందరగోళం జరిగినా గొడవలకు కారణమైన అసలు వారిపై కేసులు నమోదు చేయకుండా కేవలం స్థానిక టీడీపీ నాయకులపై మాత్రమే కేసులు నమోదు చేసి పోలీసులు చేతులు దులుపుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వారిపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తునారు.



సాయంత్రం 6 గంటల తర్వాత ఎస్సై ముందే బూత్‌లోకి చొచ్చుకెళ్తున్న టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అనుచరులు (ఫైల్)

జూనియర్ కళాశాలలుగా జెడ్పీ పాఠశాలలు



జూనియర్ కాలేజీగా మారనున్న పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల

● 11 జెడ్పీ పాఠశాలలను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు
● ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు
● విద్యాభివృద్ధికి సీఎం జగన్ సంస్కరణలపై సర్వత్రా హర్షం

పుల్లలచెరువు: గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఇంటర్ విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇంటర్ విద్య కోసం హైస్కూల్ ప్లస్‌ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. మండలానికి జూనియర్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 11 జెడ్పీ పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. వీటిలో జిల్లాలోని కామేపల్లి, పందువనాగులవరం, ముండ్లపాడు, బేస్తవారిపేట, హనుమంతునిపాడు, కొనకనమిట్ల, కొత్తపట్నం, కురిచేడు, పుల్లలచెరువు, సంతనూతలపాడు, తర్లుపాడు జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి ఇంటర్మీడియట్ విద్య అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటి నిర్వహణ బాధ్యతలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కేవలం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే విద్యా బోధన ఉంటుంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులకు శ్రీకారం చుట్టారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే చోట విద్య అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విద్యా సంస్థలు తక్కువగా ఉండటంతో కళాశాల విద్యలో ప్రైవేట్ విద్యాసంస్థలదే పైచేయిగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

నాణ్యతతో కూడిన విద్యా బోధన...

కొత్తగా ఏర్పాటయ్యే కళాశాలలకు బోధకుల కోసం ఆయా పాఠశాలల్లో పీజీ అర్హత కలిగిన ఉపాధ్యాయులను గుర్తించి వారితో విద్యా బోధన చేయించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐఎఫ్‌పీ ద్వారా ఆధునిక పద్ధతుల్లో బోధనకు చర్యలు తీసుకుంటున్నారు. అదనపు అర్హతలు కలిగిన ఉపాధ్యాయుల వివరాలను అధికారులు ఇప్పటికే సేకరించారు. వీరితో పాటు వర్క్‌లోడ్ లేని జూనియర్ కళాశాలల నుంచి రెగ్యులర్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు అధ్యాపకులను సర్దుబాటు చేసి బోధన చేసేలా కార్యచరణ జరిగిందని ఇంటర్ అధికారులు తెలిపారు. ప్రవేశాలన్నీ మాన్యువల్‌గానే జరగనున్నాయి. విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించినట్లుగా సర్టిఫికెట్లు తీసుకెళ్తే.. వారికి ఇంటర్‌లో ప్రవేశం లభిస్తుంది. గరిష్ఠంగా 80 మందిని చేర్చుకోవచ్చని అధికారులు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జెడ్పీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం శుభపరిణామమని విద్యావేత్తలు అంటున్నారు.

ఎంతో గొప్ప విషయం :



గ్రామీణ ప్రాంతాల్లో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఎంతో శుభపరిణామం. గ్రామాల్లో పదో తరగతి చదువుకుని ఇంటర్ చదివేందుకు అవకాశాలు లేక.. దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడలేక చదువు మానుకునే వారు ఎందరో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎంతో మంది చదువుకోవడానికి వీలు కలుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం మంచి నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

జి.గురు నాథం, విద్యా కమిటీ మాజీ చైర్మన్, పుల్లలచెరువు

వేగంగా ఎకో టూరిజం పార్కు పనులు



నిర్మాణంలో ఉన్న ఎకో టూరిజం పార్కు



వాచ్ టవర్ వరకు నిర్మిస్తున్న రోడ్డు

● రూ.2 కోట్లతో హాజీపురం ఫారెస్టు రోడ్డులో నిర్మాణం

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం ఫారెస్టు ఎత్తు రోడ్డు వద్ద రూ.2 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఎకో టూరిజం పార్కు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ ఎకో టూరిజం పార్కు ఏర్పాటుకు కేంద్ర అటవీ శాఖ నుంచి రూ.2 కోట్ల ప్రాజెక్టు మంజూరైంది. దీంతో ఫారెస్టు అధికారులు టూరిజం పార్కు, జిమ్ పార్కు, వాచింగ్ టవర్, రోడ్డు, ఇతర పనులను వేగంగా చేస్తున్నారు. ఈ పార్కులో జిమ్ పార్కు, క్యాంటీన్, వాచ్‌టవర్, నీటి కుంటలు, సోలార్ విద్యుత్ లైట్లు, బోరు మోటార్లు, రోడ్డు, జింకల పార్కు, వాకింగ్ పార్కు, ఆర్చి, కారు పార్కింగ్ తదితర పనులు జరుగుతున్నట్లు ఫారెస్ట్ డీఆర్‌ఓ రామిరెడ్డి తెలిపారు. ఈ పనులు రెండు సంవత్సరాలకు పూర్తవుతాయని ఆయన వెల్లడించారు. ఈ ప్రాంత వాసులకు టూరిజం పార్కులో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



పార్కులో ఏర్పాటు చేస్తున్న టూరిజం కార్యాలయం

బీజేపీ పాలనలో పెరిగిన రైతుల ఆత్మహత్యలు

● ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

ఒంగోలు టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్పొరేట్ విధానాల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం స్థానిక మల్లయ్యలింగం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే నల్లచట్టాలను తెచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలకులు దేశంలోని భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో రైతాంగం చేపట్టిన ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు నిర్బంధాన్ని ప్రయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమంలో వేయి మందికిపైగా రైతులు ఆశువులు బాసారని, నల్లచట్టాల ఫలితంగా వ్యవసాయం కుదేలై అప్పుల పాలైన రైతులు 1,50,000 మంది ఆత్మహత్యలు చేసుకుని మరణించారని చెప్పారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రస్తుత ఎన్నికలలో దేశంలోని రైతులు ఎన్డీఏకి వ్యతిరేకంగా ఇండియా కూటమికి ఓట్లేస్తున్నారని చెప్పారు. జూన్ 4 తర్వాత కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ప్రభుత్వమేనని అన్నారు. గతేడాది వచ్చిన కరువు, తుఫాన్‌లతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి, జిల్లా నాయకులు వీరారెడ్డి, పావులూరి అంజయ్య, పోలవరపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘు సమావేశంలో మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

వెలుగొండస్వామి ఆలయంలో కూలిన ధ్వజస్తంభం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం కూలిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగినట్లు దేవస్థాన ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఆలయంలోని ధ్వజస్తంభం అడుగు భాగం పూర్తిగా కుళ్లిపోయిందని, ఈదురు గాలులతో కూడిన వర్షానికి కూలిపోయిందని ఈఓ తెలిపారు. సుమారు 20 ఏళ్ల క్రితం ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేశారన్నారు. కూలిన ధ్వజస్తంభం ఆలయ గర్భగుడి అంచులపై పడటంతో అంచు కొంతమేర దెబ్బతిందని చెప్పారు. ఈ విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారులకు, ఉభయ దాతలైన గార్లదిన్నె గ్రామస్తులకు తెలియజేశామన్నారు. పడిపోయిన ధ్వజస్తంభాన్ని తొలగించి త్వరలో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తామని ఈఓ తెలిపారు.



కూలిన ధ్వజస్తంభాన్ని పరిశీలిస్తున్న ఈఓ

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



కొండలు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

త్రిపురాంతకం: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం త్రిపురాంతకం మండలం గణపవరం ఎస్సీకాలనీలో జరిగింది. కాలనీకి చెందిన మాచర్ల కొండలు (35) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఐస్ క్రీమ్ అమ్మి జీవనం సాగించే గురవయ్య ఐస్ క్రీమ్ వాహనానికి విద్యుత్ చార్జి చేసేందుకు ప్రయత్నించగా కొండలుకు విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పిల్లర్ గుంతలో పడి బాలుని మృతి

హస్తినాపురం: ఆడుకుంటూ వెళ్లిన పసిబాలుడు బహిరంగ ప్రదేశంలో ఏర్పాటు చేసిన పిల్లర్ గుంతలోని నీళ్లలో పడి మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలానికి చెందిన మదాల అచ్చమ్మ, మాల్యాద్రి దంపతులు మూడు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి వనస్థలిపురంలోని శ్రీనివాసపురం కాలనీలో నివాసం ఉంటున్నారు. అతనికి ఒక కుమారుడు మనోజ్ ఉన్నాడు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బహిరంగ ప్రదేశంలో ఉన్న పిల్లర్ గుంత వర్షపు నీటితో నిండి ఉండడంతో మనోజ్ (08) ఆడుకుంటూ వెళ్లి ఆగుంతలో పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే బాలుడిని గుంతలోంచి బయటికి తీసి వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాలుని తల్లిదండ్రులు, వారి బంధువులు బహిరంగ ప్రదేశంలో వేసిన గుంత మూలంగా తమ బాలుడు చనిపోయాడని ఆందోళనకు దిగారు. బాలుని కుటుంబ సభ్యులకు బిల్డర్ నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బిల్డర్ మృతుని కుటుంబ సభ్యులు రాజీకి వచ్చి నష్టపరిహారం చెల్లించడంతో ప్రమాదవశాత్తు బాలుడు మృతి చెందినట్లు బాలుని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.